ఆ సంగతి ఎవరో వెళ్ళి బ్రహ్మజ్ఞానికి చెప్తే ఆయన నవ్వి చెప్పాడు.

"ఇతే నాకున్న అఖరి కోరిక కూడా తీరిపోయింది."

"ఏమిటా అఖరి కోరిక?" ప్రశ్నించారు వారు.

"లోకులు నన్ను చూసి అసూయ పడాలన్న కోరిక. అది తీరింది కాబట్టి ఇంక వీటితో నాకు పనిలేదు." అని తను ఉపయోగించని ఆ విలాస వస్తువులన్నింటినీ ఇచ్చేసి కేవలం మట్టికుండ, చాప మాత్రం వుంచుకున్నాడు. ఎన్ని విలాస వస్తువులు వున్నా అవన్నీ ఆయనని అంటగలిగే శక్తి లేనివని వారు గ్రహించారు.

## 94. ప్రవర్తన

ఓ వ్యక్తి మరణించాక స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ అతనికి చాలామంది దుర్మార్గులు, అధర్మపరులు కనబడ్డారు. వాళ్ళు అక్కడికి ఎలా రాగలిగారా అని సహజంగానే కలిగే ఆసక్తితో దేవుడ్ని అతను ప్రశ్నించాడు.

దేవుడు నవ్వి అతనికి ఈ సమాధానం చెప్పాడు.

"బిడ్డా! వాళ్ళంతా నీ గురించి కూడా అదే అనుకుంటున్నారు. భూమి మీద వుండగా మనం ఎలా నడుచుకోవాలన్నది దీన్ని బట్టి గ్రహించవచ్చు. ఇతను స్వర్గానికి ఎలా రాగలిగాడు అనే అనుమానం ఎవరికీ కలగని విధంగానే అక్కడ మనం నడుచుకోవాలి."

## 95. సబబైన కోరిక

ఓ సేల్స్‌మేన్, అతని మేనేజర్, కేషియర్ కలిసి లంచ్ తీసుకోడానికి ఆఫీసు నించి బయటకి వెళ్తుంటే దారిలో వారికో పాత లాంతరు కనబడింది. దాన్ని మేనేజర్ రుద్దితే అందులోంచి ఆశ్చర్యంగా పెద్ద పొగ బయటకి వచ్చి, అందులోంచి ఓ భూతం ప్రత్యక్షం అయింది.

"మీకు ఏం కావాలో తలా ఒకటి కోరుకోండి." చెప్పిందా భూతం.

"నాకు గోవా బీచ్‌లో వున్న ఏదైనా ఫైవ్ స్టార్ హోటల్‌లో వారం పాటు గడపాలని వుంది." వెంటనే వుత్సాహంగా కోరాడు కేషియర్.

"అలాగే." అని భూతం అనగానే కేషియర్ అక్కడ నించి తక్షణం మాయం అయిపోయాడు. అది చూసి సేల్స్‌మేన్ భూతాన్ని కోరాడు.

"నేను హవాయ్ దీవుల్లోని సెవెన్ స్టార్ హోటల్‌లో పది రోజులు గడపాలి."

భూతం సరేననగానే, అతనూ మాయం అయాడు. మేనేజర్ వంక చూసి అడిగింది భూతం - నీకేం కావాలని.

"వాళ్ళిద్దరూ లేకుండా నేను ఆఫీసుని ఎలా నడపగలను? నా లంచ్ అయి నేను ఆఫీసుకి చేరుకునేసరికి వాళ్ళిద్దరూ ఆఫీసులో వుండాలి." కోరాడు మేనేజర్.

నీతి: మీ కోరికల గురించి ముందుగా మీ బాస్‌తో చెప్పి అవి సబబైనవేనా అని ఆయన్ని అడగండి. మీకున్న ఏకైక బాస్ దేవుడే అని కూడా గుర్తుంచుకోండి.

## 96. ఊసరవెల్లి

ముగ్గురు మనుషులు మూడు సందర్భాల్లో విడివిడిగా తమ గ్రామ సమీపంలోని అడవిలోకి వెళ్ళివచ్చారు. ఆ ముగ్గురూ తిరిగి వచ్చాక ఎవరికి వారు తాము ఊసరవెల్లిని చూసామని చెప్పారు.

"ఎలా వుందది?" దాన్ని అంతదాకా చూడని గ్రామస్థులు ఆసక్తిగా ప్రశ్నించారు.

"ఎర్రగా వుందది." చెప్పాడు మొదటి వాడు.

"ఎరుపు కాదది. ఆకుపచ్చగా వుంది." చెప్పాడు రెండోవాడు.

"కానేకాదు. ఊసరవెల్లి పసుపు పచ్చగా వుంది." చెప్పాడు మూడోవాడు.